క్లుప్తంగా

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని జంగాలపల్లి గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన కృష్ణంరాజు ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ బాక్స్‌లు, పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు కమలారామ్ మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కూచిపూడి చినవెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ నాగులపాటి వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.బాలభద్రారెడ్డి, ఉపాధ్యాయులు కె.అజయ్‌కుమార్, ఉపాధ్యాయినీలు పి.వి. జయలక్ష్మి, కె.అనురాధ పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత నియంత్రణ



శావల్యాపురం: మండలంలోని పోట్లూరులో అంగన్‌వాడీ సెంటరు పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలలితా బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య పాల్గొని మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలో ప్రభుత్వం అందించే వైఎస్సార్ సంపూర్ణ పోషకాహారంతో పాటు తక్కువ ధరకే లభించే ఆకుకూరలు కోడిగుడ్లు పప్పు దినుసుల్లో పోషకాహారం అధికంగా ఉంటుందన్నారు. పోషకాహారం తీసుకున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో రక్తహీనత నియంత్రణలో ఉంటుందన్నా రు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పోపూరి జ్యోతి, వైస్ ఎంపీపీ నంబూరి ప్రభావతి, పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు శింగంశెట్టి అన్నపూర్ణమ్మ, అంగన్‌వాడీ, ఆరోగ్య ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పౌష్టికాహార వారోత్సవాలు



వినుకొండ(నూజెండ్ల) : వినుకొండ పట్టణంలోని బి-సెక్టార్ పరిధిలోని 1,2,3 వార్డుల్లో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఎస్పీ పథకం కింద పది రకాల పౌష్టికాహార పదార్థాలు (టీహెచ్ఆర్) టేక్ హోమ్ రేషన్ రూపంలో ఏపీపీ ద్వారా గర్భిణీ బాలింతలకు ఫస్ట్ ప్రైజ్ (టీహెచ్ఆర్) పంపిణీ చేయడం జరిగింది. పోషక విలువల కలిగిన ఆహారం తీసుకోవాలని, చిరుధాన్యాలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తహీనత నియంత్రించవచ్చని సూపర్‌వైజర్ కె. శ్రీలత వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బి. వీరమ్మ, హెచ్‌ఎం ప్రభాకర్‌రావు, రామిరెడ్డి, కోటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పవిత్ర గ్రంథంలా మేనిఫెస్టో అమలు

- ప్రతి హామీ ప్రభుత్వం నెరవేర్చింది
- జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావిస్తూ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని కోరారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పట్టణ పరిధిలోని పురుషోత్తమపట్నం 31వ వార్డులో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన మంత్రికి స్థానికులు తీన్‌మార్ డోలక్ వాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. మంత్రి విడదల రజిని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరిస్తూ, స్థానికుల సమస్యలు సైతం వింటూ వాటికి పరిష్కారాలను సంబంధిత అధికారులకు తెలుపుతూ కార్యక్రమం కొనసాగించారు.

ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ అందజేస్తున్నదని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని వివరించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఏపీకి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని వెల్లడించారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించటమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వెల్లడించారు. మరోవైపు నాడు-నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు.

ప్రజలంతా ప్రభుత్వానికి అండగా ఉన్నారని చెప్పేందుకు కార్యక్రమానికి లభిస్తున్న ఆదరణే నిదర్శనమన్నారు. ప్రభుత్వంపై ప్రజలు ఎంతో నమ్మకం, విశ్వాసంతో ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ విడదల గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మాజీ చైర్మన్ విడదల లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి షేక్ గాలిబ్‌షా, పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ అల్లీమియా, నాయకులు బైరా వెంకటకృష్ణ, విడదల కమలేంద్ర, తోట రామచంద్రప్రసాద్, విడదల హరినాథ్‌బాబు, సయ్యద్ సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు ఖరీదైనవి.. ఇప్పుడు పూర్తిగా ఉచితం

వినుకొండ(నూజెండ్ల): అరుదైన, ఖరీదైన మందులు ఇప్పుడు ప్రభుత్వం తరపున పూర్తిగా ఉచితంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులోకి వచ్చిన హార్ట్ స్ట్రోక్ వచ్చి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఇచ్చే ఇంజక్షన్‌కు సంబంధించిన మందులను పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హార్ట్ స్ట్రోక్ వచ్చిన 10 నిమిషాల లోపు ఈ ఇంజక్షన్‌ను రోగికి చేయగలిగితే వారికి ప్రాణహాని ఉండదని, అలాంటి మెడిసిన్ ప్రైవేటు ఆసుపత్రుల్లో సుమారు రూ.40 వేలు విలువ కలిగి ఉంటుందని, అలాంటిది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా పూర్తిగా ఉచితంగా పేద ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రజాక్, ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



నూతన మందులను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

పేద బ్రాహ్మణులకు సరుకుల పంపిణీ

నరసరావుపేట ఈస్ట్: శ్రీవాగ్దేవి స్మార్త పురోహిత సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని పేద బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వాసవీ కన్యకాపరమేశ్వరీ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి హాజరై 108 మంది పేద బ్రాహ్మణ కుటుంబాలకు సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పల్నాడుజిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, సంఘం అధ్యక్షుడు కె.దిలీప్‌కుమార్, రంగావఝల సుబ్రమణ్య శాస్త్రి, సాగి శివకృష్ణ పాల్గొన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

విద్యార్థి వ్యక్తిగత సామర్థ్యాలను మెరుగు పరచాలి

- నరసరావుపేట డీవైఈవో వేణుగోపాలరావు
- లింగారావుపాలెం జెడ్పీ హైస్కూల్ సందర్శన



9వ తరగతి విద్యార్థుల రాతపుస్తకాలను పరిశీలిస్తున్న డీవైఈవో వేణుగోపాలరావు

యడ్లపాడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్ని వ్యక్తిగత సామర్థ్యాన్ని గుర్తించి వెనుకబాటులో ఉన్న వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నరసరావుపేట ఉపవిద్యాశాఖ అధికారి(డీవైఈవో) కె.వేణుగోపాలరావు పేర్కొన్నారు. యడ్లపాడు మండలం లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. పాఠశాలలోని 9,10 తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల విద్యా సామర్థాలను, నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. ఇప్పటి వరకు పూర్తయిన సిలబస్, వాటికి సంబంధించిన నోట్స్ తయారీ తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థులకు అవగతం అవుతున్నదా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. ఆంగ్లం, తెలుగు, హిందీ, గణితం పాఠ్యాంశాలల్లోని ప్రశ్నలకు విద్యార్థుల నుంచి జవాబుల్ని రాబట్టి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతిక విద్యను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం అందించిన ఐఎఫ్‌పీ బోర్డులు, బైజూస్ ట్యాబ్‌లను ఎలా ఉపయోగిస్తున్నారనేది అడిగి తెలుసుకున్నారు. వాటి ప్రయోజనాలు, ప్రభుత్వం అందుకు వెచ్చిస్తున్న వ్యయం గురించి విద్యార్థులకు వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయులు విధిగా డైరీలు రాయాలని, అలాగే పాఠ్యాంశాల ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. విద్యలో వెనుకంజలో ఉన్న విద్యార్థుల్ని గుర్తించి వారికి ప్రత్యేక తరగతుల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. జగనన్న గోరుముద్ద మెనూ ప్రకారంగా అమలు అవుతుందో లేదో విద్యార్థుల నుంచి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణం, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల క్రమశిక్షణ అన్నింటికీ మించి గ్రామస్తులు అందిస్తున్న సహకారం గురించి పాఠశాల హెచ్‌ఎం కేవీ రామిరెడ్డి డీవైఈవోకు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రామాంజనేయులు, శైలజా, శ్రీనివాసరావు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ స్క్రీనింగ్ క్యాంప్

వినుకొండ(నూజెండ్ల): స్థానిక జాషువా కళాప్రాంగణంలో కమిట్మెంట్ సంస్థ, ఎన్ఐఎల్‌డీ సంస్థ వారి ఆధ్వర్యంలో అర్థో లోపం, వినికిడి లోపం, చూపు లోపం ఉన్నవారికి ఉపకరణాలను అందజేసేందుకు బుధవారం స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, ఎంపీడీవో మంగాపుర్‌నాథ్‌లు మాట్లాడుతూ దివ్యాంగులు ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులకు త్వరలో పరికరాలను అందజేస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రామాంజనేయులు, కమిట్మెంట్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్. ఝాన్సీరాణి, పీఎం ఉదయ్ కిరణ్, కోఆర్డినేటర్స్, కార్యకర్తలు, ఎన్ఐఎల్‌డీ సిబ్బంది, ఎగ్జిక్యూటివ్ సర్వీస్ ఆఫీసర్ గంగాధర్‌రావు పాల్గొన్నారు.



దివ్యాంగుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న నిర్వాహకులు

దుస్తుల పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని భవిత ఐఈఆర్‌సీ కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మండలంలోని జాలలపాలెం గ్రామంలోని ఆర్‌సీఎం ఉపాధ్యాయుడు బాలస్వామి అందజేసిన నూతన వస్త్రాలను ఎంఈవో సయ్యద్ జఫ్రుల్లా అందజేశారు. వస్త్రాలను బహుకరించిన ఉపాధ్యాయుడు బాలస్వామికి ఐఈఆర్‌పీ సాంబశివరావు ధన్యవాదాలు తెలియజేశారు.

పోలింగ్ స్టేషన్ల మార్పుపై విచారణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ అంకారావు

రొంపిచర్ల: మండలంలోని నల్లగార్లపాడు గ్రామంలో 16,17 పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ అంకారావు బుధవారం పరిశీలించారు. పోలింగ్ స్టేషన్‌లను అక్కడి నుండి మార్చాలని గ్రామస్తులు పెట్టుకున్న ఫిర్యాదు మేరకు ఆయన పరిశీలించారు. స్థానికులను విచారించారు. ప్రస్తుతం ఈ పోలింగ్ బూత్‌లు బావి పక్కనే గల సంఘం డైరీ పాలకేంద్రంలో ఉన్నాయి. వాటిని వేరే చోటికి మార్చాలని వచ్చిన ఫిర్యాదు మేరకు విచారించారు. ఈ కార్యక్రమంలో గోదా రమేష్ కుమార్, రమణారెడ్డి, మస్తాన్‌రెడ్డితో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం

శావల్యాపురం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఈనెల 15న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య బుధవారం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఆరోగ్యపరంగా మెరుగైన సేవలు అందించటానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటి సర్వే చేస్తారని, ప్రజల తమవంతు సహకారం అందించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలో 11 గ్రామ సచివాలయాలు వారీగా ఈనెల 30న కనమర్లపూడి, వచ్చే నెల 03న వేల్పూరు-1, వేల్పూరు-2 గ్రామ సచివాలయాలు, 05న గుంటుపాలెం, 07న మతుకుమల్లి, 08న శానంపూడి,11న పిచికలపాలెం, 13న కారుమంచి, 16న కొత్తలూరు, 19న పోట్లూరు గ్రామ సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష శిబిరాల్లో పాల్గొన్న వారందరికీ ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులు అందజేస్తారన్నారు.

అసోసియేషన్ గుర్తింపుపై కార్మికుల హర్షం

వినుకొండ(నూజెండ్ల) : ఏపీఎస్ఆర్టీసీలో అతి పెద్ద అసోసియేషన్‌గా గుర్తింపు ఉన్న ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్‌కు ప్రభుత్వం గుర్తించి జీవో జారీ చేయడంపై వినుకొండ డిపో మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూఏ వ్యవస్థాపకులు స్వర్గీయ పి.రామ్మోహన్ రావు విగ్రహానికి యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ముప్పాళ్ల శ్రీనివాసరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎంయూకు అతిపెద్ద యూనియన్‌గా ప్రభుత్వ గుర్తింపు లభించడం హర్షనీయమని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ సలహాదారు బి.మోహన్‌రావు, కార్యదర్శి వి.శివప్రసాద్‌నాయక్, అధ్యక్షులు బి.సౌభాగ్యరాజు, చైర్మన్ పి.వి.ఎస్.ఆర్.మూర్తి, హరిహరబాబు, డి.శ్రీను, యోగి, సాయి తదితరులు పాల్గొన్నారు.



రామ్మోహన్‌రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వృద్ధులకు చీరలు పంపిణీ

నరసరావుపేట రూరల్: రైల్వేగేటు సమీపంలోని పట్టణ నిరాశ్రయుల ఆశ్రమంలో వృద్ధులకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని పొన్నపాటి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పొన్నపాటి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు, లింగంగుంట్ల మాజీ సర్పంచ్ పొన్నపాటి విజయకృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు నంద్యాల సత్యనారాయణ రెడ్డి, పొన్నపాటి సుబ్బారెడ్డి, పొన్నపాటి పాపిరెడ్డి, యన్నం లక్ష్మీరెడ్డిలు పాల్గొన్నారు. 40 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమం నిర్వాహకురాలు పూనూరి కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ కార్డులు అప్‌డేట్ చేయించుకోండి

సెంట్రల్ కామన్ సర్వీస్ కమిషనర్ కె.రాజ్‌కుమార్



గణపవరంలో సిబ్బందితో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

నాదెండ్ల: తల్లి బిడ్డకు చేసే సేవలా ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అవినీతి రహితంగా చిత్తశుద్ధితో సేవ చేయాలని సెంట్రల్ కామన్ సర్వీస్ కమిషనర్ కె.రాజ్‌కుమార్ చెప్పారు. గణపవరం 1వ సచివాలయంలో బుధవారం కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న నేషనల్ డేటాబేస్ ఆఫ్ అన్‌ఆర్గనైజ్డ్ వర్కర్స్ రిజిస్ట్రేషన్‌లో భాగంగా సచివాలయ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ-శ్రమ్ కార్డులు మంజూరు చేశామని, ప్రస్తుతం పల్నాడు జిల్లాలో వీటిని అప్‌డేట్ చేసి కార్మికులకు అందించాలన్నారు. కొత్త కార్డులు అవసరమైన వారికి ఇవ్వాలని తెలిపారు. ఇందులో భాగంగా 18-59 ఏళ్ల వయస్సు గల రైతులు, మత్స్యకారులు, చిన్నపరిశ్రమల కార్మికులు, చేనేత, చేతివృత్తులు, వడ్రంగులు, వీధి వర్కర్లు, రవాణా రంగం కార్మికులు, వ్యవసాయ కూలీలు, ఇండ్లలో పనిచేసే పనివారు, ఉపాధి హామీ కూలీలు, ఆశలు, వివిధ చేతివృత్తులు నిర్వహించే వారు అర్హులన్నారు. మరికొన్ని రోజుల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల బృందం, సచివాలయ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. అర్హులైన వారు ఆధార్‌కార్డు, లింకైన మొబైల్ నెంబరు, బ్యాంకు ఖాతా వివరాలు అందించాలన్నారు. ఈ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కార్మికులకు అందించే సదుపాయాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అర్వపల్లి శేఖర్, కవిత, జ్యోతి, డిజిటల్ అసిస్టెంట్లు భరత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ పింఛన్లు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఈపూరు మండలం ఊడిజర్ల గ్రామంలో కొత్త పింఛన్లు మంజూరైన 30 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా అర్హులైన వారందరికీ వలంటీర్ల ద్వారా తెల్లవారుజామున నేరుగా ఇంటి వద్దకే వచ్చి పింఛన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. అంతే కాకుండా గత ప్రభుత్వంలో నెలకు రూ.వెయ్యి మాత్రమే అందించారని, ఎన్నికలకు 4 నెలల ముందు రూ.2 వేలు అందజేశారని, కాని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూ.2 వేల రూపాయలు అందిస్తూ ప్రతి సంవత్సరం పెంచుకుంటూ రూ.3 వేల వరకు అందజేయనున్నారన్నారు. కార్యక్రమంలో అధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 1వ వార్డులో నూతనంగా మంజూరైన 10 పింఛన్లను వార్డు కౌన్సిలర్ వై. నాగేశ్వరి రామిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ డేవిడ్, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: అర్హత కలిగిన పేదలందరికీ పార్టీలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్న ఘనత సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ వెల్లడించారు. బుధవారం మండలంలోని వేల్పూరు గ్రామ సచివాలయంలో నూతనంగా మంజూరైన వైఎస్సార్ సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీలో మొదట విడతలో 159, రెండవ విడతలో 237 అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు మంజూరైనట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపిస్తున్నారన్నారు. అనంతరం 89 నూతన పింఛన్‌దారులకు నగదు అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, వైఎస్సార్ సీపీ గ్రామపార్టీ అధ్యక్షులు తూమాటి కబ్బారావు, మాజీ జెడ్పీటీసీ స్వర్ణాల వెంకట్రావు, ముండ్రు సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి అళ్ళ యుగంధర్ పాల్గొన్నారు.



వినుకొండలో లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



శావల్యాపురంలో నూతన పింఛనుదారుడికి నగదు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

గణపవరంలో..

నాదెండ్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుని దరి చేర్చాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు చెప్పారు. గణపవరం ఒకటో సచివాలయం వద్ద బుధవారం నూతనంగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుక- సామాజిక భద్రతా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల పరిధిలో కొత్తగా 406 పింఛన్లు మంజూరయ్యాయని, గణపవరం గ్రామంలోని నాలుగు సచివాలయాల పరిధిలో 112 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. మండల పరిధిలో 9400కు పైగా పింఛన్లు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే నాలుగు రెట్లు అధికంగా పింఛన్లు అందిస్తూ సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛను అందాలంటే ఎన్నో అగచాట్లు పడాల్సి వచ్చేదని, జన్మభూమి కమిటీ సభ్యుల చేతులు తడిపి, టీడీపీ కండువా కప్పుకుంటేనే అరకొరగా సంక్షేమ పథకాలు అందేవన్నారు. పంచాయతీ కార్యాలయాల ముందు క్యూలో నిలబడి పింఛను తీసుకోవాల్సి వచ్చేదన్నారు. అలాంటి సమయాల్లో వృద్ధులు, మహిళలు సొమ్మసిల్లి పడిపోయేవారన్నారు.

ప్రస్తుత ప్రభుత్వం 1-5వ తేదీలోగా వలంటీర్ల ద్వారా ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి తలుపు తట్టి పింఛను ఇస్తున్నారన్నారు. దీంతో పింఛనుదారుల్లో ఆనందం వ్యక్తమౌతోందన్నారు. నూతన పింఛన్ల పంపిణీలో ఈ నెల 14 వరకూ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పిల్లి సాగర్ బాబు, ఆదంవలి, తులం సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, పంచాయతీ కార్యదర్శులు అర్వపల్లి శేఖర్, కవిత, జ్యోతి, వెల్ఫేర్ అసిస్టెంట్లు భరత్‌కుమార్, దయానిధి, ఖాజాకీజర్ పాల్గొన్నారు.



గణపవరంలో నూతన పింఛన్లు అందిస్తున్న వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు

ఓటర్ల జాబితా సవరణలు పూర్తి చేయాలి

నాదెండ్ల: ఓటర్ల జాబితాలో సవరణలను గురువారం సాయంత్రంలోగా పరిష్కరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దార్ నాంపల్లి నాగమల్లేశ్వరరావు చెప్పారు. బుధవారం తన కార్యాలయంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, వీఆర్వోలకు ఎలక్షన్ క్లెయిమ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు, సవరణలతో పాటు పోలింగ్ బూతుల్లో మార్పుల కోసం వివిధ రాజకీయ పార్టీల నుంచి వచ్చిన దర ఖాస్తులను గురువారంలోగా పరిష్కరించేందుకు పనిచేయాలన్నారు. రీసర్వే కూడా పూర్తయినందున తుది జాబితా సిద్ధం చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ షేక్ రమీజా ఉన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

నాదెండ్ల: మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ఈ నెల 18న జరగనున్న వినాయక చవితి వేడుకలకు విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ముందుగా అనుమతులు తీసుకోవాలని ఎస్సై జి బలరామిరెడ్డి చెప్పారు. మండలంలోని ప్రతి గ్రామంలో వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసే వారు పోలీసు నిబంధనలు పాటించాలన్నారు. నిర్వాహకులు ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు. విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం, తేది, నిమజ్జనం చేసే తేదీ, నిమజ్జనానికి వినియోగించే వాహన వివరాలు వగైరా వివరాలను పొందుపర్చాలన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున డీజేలు గానీ, భారీ ఊరేగింపులకు అనుమతులు లేవన్నారు. సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. రాజకీయ పార్టీల జెండాలు, పాటలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని తెలిపారు.

రేపటి నుంచి మండలస్థాయి స్కూల్ గేమ్స్

నరసరావుపేట రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాల, బాలికల మండల స్థాయి పోటీలు ఈనెల 15,16 తేదీలలో లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు పోటీల మండల కోఆర్డినేటర్ ఝాన్సీరాణి తెలిపారు. పోటీలపై బుధవారం పీఈటీలు, పీడీలతో సమావేశం నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిడ్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, యోగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల బాల, బాలికలు పోటీలలో పాల్గొనాలని కోరారు.

రేపటి నుంచి విద్యాశాఖ స్కూల్ గేమ్స్

శావల్యాపురం: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 15,16 తేదీల్లో జరుగుతాయని స్కూల్ గేమ్స్ కోఆర్డినేటరు రాగుల రాధాకృష్ణమూర్తి బుధవారం తెలిపారు. వాలీబాల్, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటిన్, త్రోబాల్, ఖోఖో, యోగా, టెన్నీస్‌కాయిట్, షటిల్ బ్యాడ్మింటిన్, అథ్లెటిక్స్ నందు అండర్-14, అండర్-17 సంవత్సరాలోపు బాలబాలికల విభాగపు పోటీల్లో ఎంపిక నిర్వహిస్తామని, మండల స్థాయిలో ఎంపికైన బాలబాలికలు ఈనెలఖారు నియోజకవర్గస్థాయి జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. 01-01-2010 సంవత్సరంలో పుట్టిన వారు అండర్ -14 విభాగంలో 01-01-2007 తరువాత పుట్టినవారు అండర్-17 విభాగపు క్రీడాపోటీల్లో పాల్గొనడానికి అర్హులన్నారు. ప్రభుత్వం గుర్తించిన అన్నీ పాఠశాలల విద్యార్థులు ఈఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. ఈఎంపిక పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఆధార్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులచే ధ్రువీకరించిన స్టడీ పత్రాన్ని తీసుకొని పోటీల్లో హాజరు కావాలన్నారు. మండల స్థాయి ఎంపిక పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, ఎంఈవోలు మద్దికుంట సాంబశివరావు, పుసులూరి లలితాకుమారిల పర్యవేక్షణలో జరుగుతాయన్నారు.